# ఏమి అదృష్టం!

[కథానిక]

✽

— శ్రీమతి ఆచంట శారదాదేవి —

"జమీందారుగారి భార్య నిన్ను చూడాలన్నది. మధ్యాహ్నం వెళదామా ఒకసారి" అన్నాడు సంజీవరావు, ఇంటికి రాగానే. "నన్నా! ఎందుకూ!" అన్నది విమల–వంచిన తల ఎత్తకుండా, పిల్లవాడికి పాలు కలుపుతూ....

సంజీవరావు, తిరిగి తిరిగి, ఎక్కడా వుద్యోగం దొరకదని నిస్పృహ చేసుకొన్న వారంరోజులకు, జమీందారుగారబ్బాయి కొక ట్యూటరు కావాలని తెలియ వచ్చింది. ఆశతో జమీందారుదర్శనం చేసుకున్నాడు. కోరిక ఫలించింది. చిన్నదొర కూడాకూడా తిరగటం, అతనికి బుద్ధిపుట్టినప్పుడు రెండుముక్కలు చెప్పటం కంటె వేరే పని యేమీ లేదు. జీతానికి లోపంలేదు. ప్రాణం కుదుటబడ్డది. రాణీ అప్పుడప్పుడు సంజీవరావుకు కబురుచేసి పిల్లవాడి యోగక్షేమాలు కనుక్కునేది. అల్లాగే సంజీవరావు కష్టసుఖాలుకూడా విచారించేది. క్రమేణా సంజీవరావుకు ఆమెయందు చాలా గౌరవం ఏర్పడ్డది. విమల రాణీగారిని చూడటానికి ఉత్సాహపడటం బదులు అడ్డప్రశ్నలు వెయ్యటం చూసి సంజీవరావుకు చిరాకు వేసింది.

"ఎందుకేమిటే, నీ మొహం! ఆవిడ అంతగా నిన్ను చూడాలని అంటూ వుంటే నువు—"అన్నాడు విసుగుతో.

"అదికాదండీ, నాకు మంచిచీర ఒక్కటి అయినా లేదుగదా, ఎల్లాగ అనీ."

విమలకు ఎక్కడికైనా వెళ్లాలన్నప్పుడల్లా తనకు మంచిచీరెలు లేవని జ్ఞాపకంవస్తూ వుంటుంది. అందుకనే సంజీవరావు ఆమెను ఎక్కడికీ తీసుకుపోనేపోడు.

"నీ పెళ్లినాటి పట్టుచీరె వున్నదిగదా, అది చాల్లేద్దూ" అన్నాడు సముదాయిస్తూ.

"అదేమి చీరండీ! అంతా వెలిసిపోయింది! కొంచెం చినిగిందికూడాను" అన్నది, మారాము పెడుతూ.

"ఫరవాలేదులే. ఏచీర కట్టుకున్నా ఆవిడకంటే అందంగానే వుంటావు." అన్నాడు సంజీవరావు, కొంటెగా నవ్వుతూ.

విమలముఖము కలువపువ్వులాగ వికసించింది. ఆమెకళ్లల్లో సంతోషం ఉక్కిరిబిక్కిరయింది. కాని మరుక్షణమే విచారరేఖలు ముందుకు తోసుకు వచ్చాయి. "ఏమోలెండి, ఎల్లా వుంటేనేం, ఆవిడ అదృష్టం నా కెల్లా వస్తుందీ" అంది......

"సరేలే, మూడుగంటలకు నువ్వూ పిల్లలూ సిద్ధంగా వుండండి. నేను వచ్చి తీసుకుపోతాను" అన్నాడు, అతను, మళ్లీ కండువా పైన వేసుకుంటూ.

* * * *

విమల పన్నెండింటికే మొదలుపెట్టింది ప్రయాణ సన్నాహం. అయినా, పిల్లలకు తలదువ్వి నీళ్ళుపోసి తనూ సింగారించుకునేప్పటికి మూడు కొవచ్చింది. విమలకు విసుగూ, విచారం ముంచుకువచ్చాయి..."ఏమి జీవితం! పొద్దున లేచిందిమొదలు రాత్రి పదిగంటల దాకా క్షణం తీరిక లేదు. ఎక్కడికి వెళ్ళాలన్నా విశ్వ ప్రయత్నం కావాలి. జీవితంలో విశ్రాంతి, శాంతి రెండూ లేవు. అన్నీ తీరని కోరికలే...ఇప్పుడు జమీందారుగారింటికి వెళ్ళకపోతేనేం? తను ఆమెకంటె అందంగా వుంటుందట,—అయితేమాత్రం ఆమెకూ తనకూ సామ్యం ఏమిటి? ఆమె లక్ష్మీప్రసన్నురాలు, తన వెలిసిన చీర, తనూ—బండిఆగిన చప్పుడు విని తలుపుతీసింది.

"రెడీగా ఉన్నారా? పోదామా?"

"ఊఁ! చూడండి: ఆవిడకు చాలా గర్వమా?"

"ఛీ!, చాలా మంచి మనిషి."

తల వాల్చుకొని బండి ఎక్కింది విమల. పిల్లలిద్దరూ బండిమాసి మురిసిపొయ్యారు....

*   *   *   *

జమీందారిణిగారి పేరు గుణవతీ దేవి. ఆమే, జమీందారుగారూ ఒకరినొకరు చూసుకొని కొన్ని సంవత్సరాలవుతుంది...గుణవతి ఇప్పుడు కేవలం విలువైన వస్తువులు కొనడంతోనే హృదయాన్ని తృప్తిపరచుకోవాలని చూస్తున్నది. చీరెలూ, నగలూ సంతోషాన్ని ఇవ్వడం మానేసి చాలా రోజులైనా కూడా అలవాటు చొప్పున ఇంకా కొంటూనే ఉంటుంది. పైగా ఆమెకు అదే వ్యాపకం కూడాను. ఇవ్వాళకూడా విమల వచ్చే సరికి ఆవిడ చీరల బేరంలోనే వున్నది.

"డబుల్ కలర్ చీరెలు ఇప్పుడు చాలామందికడుతున్నారమ్మా. ఈ చీర చిత్తగించండి" అంటున్నాడు సెట్టి......విమల చీర చినుగు కనపడకుండా కుచ్చెళ్లు సర్దుకుంటూ రాణీని సమీపించింది.

"రండి, కూర్చోండి" అన్నది సోఫా చూపిస్తూ, గుణవతి. విమల బెదురుతూకూర్చున్నది, చీరలనుచూస్తూ. ఎంత మంచి చీరెలు! ఎంత చక్కని జరీపని! ఆ చీరలన్నీ చూస్తూవుంటే, తన వంటిన వెలిసిపోయిన చీర ముళ్లు గ్రుచ్చుకుంటున్నట్లున్నది.

గుణవతికి మాత్రం ఒక్కచీరా నచ్చలేదు. అసలు ఆమెకు కావలసినది చీరెలయితే గదా! "ఏమీ బాగా లేవు, రేపు ఇంకేమయినా రకాలు పట్టుకురా." అన్నది సెట్టితో.

"చిత్తం" అంటూ మూట కట్టుకొని వెళ్ళిపోయాడు సెట్టి......దాసీది టీ తెచ్చిపెట్టింది....

"'టీ' పుచ్చుకొంటారా" అన్నది గుణవతి. విమల గుణవతికేసి తలెత్తిచూసింది. అందం లేకపోయినా, ఆమెముఖంలో ఎంత ఠీవి వున్నది! ఏదో చెప్పలేని ఆకర్షణ!...కళ్లల్లో మాత్రం విచారం కనబడుతుంది.

"వద్దండీ, నాకు అలవాటు లేదు" అన్నది వినపడీ వినపడకుండా.

గుణవతి, మాట్లాడకుండా, రెండు కప్పులలో టీ పోసి పిల్లలిద్దరికీ ఇచ్చింది. చిన్నవాడు చేతి పట్టులేక టీ అంతా కాశ్మీర తివాసీమీద కొంతా, తన చొక్కామీద కొంతా వలకబోసుకున్నాడు. ఖరీదయిన తివాసీ మరకైందన్న భయంతో పిల్లవాడిమీద కోపం వచ్చింది విమలకు. "ఏమి సంతానం" అని మనస్సులో విసుక్కున్నది. గుణవతిమాత్రం, నవ్వుతూ, పిల్లవాడిని దగ్గరకు తీసుకొని పట్టురుమాలుతో తుడిచి మళ్లీ టీ త్రాగించింది......విమలకు కొంచెం ఊపిరి సలిపింది.

"ఎప్పుడూ ఇంతే! ఎక్కడికెళ్లినా ఏదో వకటి. బయట అడుగు పెట్టడానికే భయం" అన్నది విమల.

"ఫరవాలేదండీ! ఈమాత్రానికే!!" అంటూ నవ్వింది గుణవతి.

"అది కాదండీ, నాకు వీళ్ళతో విసుగొస్తున్నది. ఒక్క నిమిషమైనా విరామం లేదు, ఎప్పుడూ నా కొంగు పట్టుకొని వదలరు" అన్నది విమల,—సంసారం గొడవల్లోకి దిగుతూ, మామూలు ధోరణిలో.

"మంచిదేగదా, మీకు బాగా కాలక్షేపం అవుతుంది."

"సరేలేండి, వీళ్లతో ఒక్కపనీ తెమలదు."

గుణవతి అకారణంగా నవ్వింది. "అదీ! మీకు తీరికలేని పని. అందునించి విసుక్కుంటున్నారు. నాకు రోజంతా ఏమీ తోచదండీ!?...ఇంక మా బాబు, నే రమ్మని కబురుచేస్తేనేగాని నా దగ్గరకు రాడు. వచ్చినా, పదినిమిషాలుకూడా వుండడు. వాడికి నాదగ్గర కంటె 'ఆయా' దగ్గరే ఎక్కువ చనువు! నేను లేకపోయినా ఏమీ బాధపడడు కాని 'ఆయా'ను విడిచి ఒక్క నిమిషంకూడా వుండలేడు!"అని గట్టిగా నవ్వింది.

ఆ నవ్వులో విషాదం ప్రతిధ్వనించింది.

విమల విస్తుపోయి చూసింది: "దాసీలూ! దాదులూ! పనిలేక ప్రొద్దుపోదట! ఎంత అదృష్టవంతురాలు!!" అనుకున్నది.

"పంతులుగారు కూడా వచ్చారా" అన్నది గుణవతి—ప్రసంగం మారుస్తూ.

"ఆ! బయట వున్నారు......నేను వెళ్తాను, చాలాసేపైంది" అంటూ లేచింది విమల.

దాసీది పళ్లూ, తమలపాకులూ తెచ్చిపెట్టింది.

"తరుచు వస్తూవుండండి" అన్నది గుణవతి.

"అల్లాగే. కాని, నాకు ఇల్లు కదలడానికే వీలుండదండీ. పనిఅంతా పూర్తిచేసుకొనేసరికి ఆయన ఇంటికి వస్తారు. ఏవో కబుర్లతోటి గడిచిపోతుంది. నేను లేకపోతే ఆయనకేమీ తోచదు" అన్నది విమల సిగ్గుపడుతూ. గుణవతికి కళ్ళు చెమ్మగిల్లినవి.

పిల్లలు పళ్ళకోసరం ఎగబడ్డారు. ప్రతిదానికీ వాచిపోవటమే! విమలహృదయం అవమానంతో, దుఃఖంతో క్రుంగిపోయింది. కళ్లల్లో నీరు నిండింది.

గేటు దాటుతూ భర్తతో "ఎంత నిదానమైన మనిషి! ఏ కొరతా లేదుగదా! ఏమి అదృష్టం!!" అన్నది కళ్లు తుడుచుకుంటూ.

"ఎంత అందంగా వున్నది! చిలకా గోరువంకలలాగా వున్నారు. ఏమి అదృష్టం" అనుకున్నది గుణవతి,—కిటికీలోంచి చూస్తూ...కన్నీటిధార ఆపుకోలేకపోయింది.

